సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం, 15, మే, 2024



ప్రమాదాలకు కేరాఫ్.. దాబాలు

హైదరాబాద్–హనుమకొండ జాతీయ రహదారిపై విచ్చలవిడిగా దాబాలు వెలుస్తున్నాయి. డివైడర్లు, క్రాసింగ్‌ల వద్ద ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. - 8లో▸



మెస్ ఓపెన్ చేయాలి

కేయూలోని పద్మాక్షి మహిళా మెస్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు ఆ హాస్టల్ వద్ద ఆందోళనకు దిగారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం 38.0°/27.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

18న సదరం క్యాంపు

భూపాలపల్లి రూరల్: జిల్లాలోని శారీరక, వినికిడి, మానసిక, కంటిచూపు అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈ నెల 18వ తేదీన జిల్లా కేంద్రంలోని 100పడకల ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపులో పరీక్షలు చేస్తారని కావున దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ నరేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు 15వ తేదీ (బుధవారం) ఉదయం 11గంటలకు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ప్రారంభమవుతుందని తెలిపారు. మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని 18న నిర్వహించే క్యాంపునకు హాజరు కావాలని సూచించారు. గతంలో రిజెక్ట్ అయిన వారికి అవకాశం లేదని వివరించారు.

ఎన్‌ఓఎస్ దరఖాస్తుల స్వీకరణ


భూపాలపల్లి రూరల్: జిల్లాలోని గిరిజన విద్యార్థులు విదేశాల్లో మాస్టర్స్ లెవెల్, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రామ్స్ చదవాలనుకునే వారి నుంచి 2024–25 విద్యా సంవత్సరానికి నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఓఎస్) కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ ఏటూరునాగారం ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ పోచం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి, ఆసక్తి గల గిరిజన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తులు https://overseas. tribal. gov. in ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



చిట్యాల: ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని యోగా గురు, మండలాధీశ్వర్ విశాఖపట్నం లలిత గాయత్రి మాతాజీ అన్నారు. మండల పరిధిలోని జూకల్‌లో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారణ కార్యక్రమానికి ఆమె మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధి చెందేందుకు భక్తిని అలవర్చుకోవాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికే దేశంలోని అన్ని ప్రాంతాలు తిరుగుతున్నానని వివరించారు. గ్రామంలో యోగా సాధనలో గురూజీ సాయిరెడ్డి స్వామి ఆదర్శమన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి 23 ఏళ్లుగా ఆంజనేయ దీక్ష మాలతో నిత్యం దైవ కార్యక్రమాల్లో పాల్గొంటూ భక్తులకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. యోగా, మెడిటేషన్, న్యాచోరోపతి, శరీర త్రీకరణశుద్ధితో అమ్మవారి సంకల్పంతో చేస్తామన్నారు. హిందూధర్మం కోసం పనిచేస్తున్న సాయిరెడ్డి స్వామికి శ్రీశ్రీ సాయిరెడ్డి ఆనంద సరస్వతి స్వామి పేరుతో నామకరణం చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే జూకల్ హనుమాన్ సేవా సమితిని.. శ్రీ హనుమాన్ గాయత్రి పీఠంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

గ్రావిటీ కాల్వలో పచ్చని వరిపైరు!



కాళేశ్వరం: నిండు ఎండాకాలం గ్రావిటీ కాల్వలో పచ్చని వరిపైరు దర్శనమిస్తుందని ఆశ్చర్యపోతున్నారా! కాదండి సుమా! అది నీటిలో మొలకెత్తిన గడ్డి. మహదేవపూర్ మండలం కాళేశ్వరం టు అన్నారం గ్రావిటీ కాల్వ మీదుగా ప్రయాణం చేసేవారికి మాత్రం అక్కడక్కడా అచ్చం వరిపైరులాగానే కనిపిస్తూ చూపరులను ఆకర్షిస్తోంది. దీంతో అటు వైపుగా వెళ్లే వారంతా వాహనాలు నిలిపి మరీ చూసి వెళ్తున్నారు. నిజంగా నిండు వేసవికాలంలో ఎక్కడా పచ్చని పైరు కనిపించదు. అలాంటిది గ్రావిటీకాల్వలో మాత్రం నీరు నిలిచి ఉండడంతో పచ్చని గడ్డి మొలకెత్తి చూపరులను ఆకర్షిస్తోంది.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



గోవిందరావుపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ అప్పయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఓపీ, గర్భిణుల, అసంక్రమిత రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం రంగాపురంలో గల ఉప ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చంద్రకాంత్, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

తగ్గింది.. పెరిగింది.. ఎక్కడ?

వరంగల్ ఎంపీ స్థానంలో పోలింగ్‌పై అధికారులు, పార్టీల పోస్టుమార్టం

- 68.86 శాతం నమోదైనట్లు ప్రకటించిన ఎన్నికల అధికారులు
- గతంతో పోలిస్తే 5.17 శాతం పెరిగిన పోలింగ్
- గెలుపు ఓటములపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల లెక్కలు
- విజయంపై ఎవరి ధీమా వారిదే..
- నియోజకవర్గాల వారీగా సమీక్ష.. ముఖ్య నేతలతో అభ్యర్థుల చర్చలు



సాక్షిప్రతినిధి, వరంగల్:

వరంగల్ లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌పై పోస్టుమార్టం జరుగుతోంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి భారీగా పోలింగ్‌శాతం పెంచేందుకు విస్తృతంగా చర్యలు చేపట్టిన కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారులు కూడా సమీక్ష చేస్తున్నారు. మరోవైపు పోలింగ్‌శాతం ఎక్కడ పెరిగింది? ఎక్కడ తగ్గింది? ఎవరికీ లాభం, ఎవరి నష్టం? అన్న లెక్కల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నిమగ్నమయ్యాయి. వరంగల్ పార్లమెట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సమయం దాటినా క్యూ లైన్లలో ఉన్నవారిని అనుమతించి రాత్రి వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 18,24,466 ఓటర్లకు 12,56,301 (68.86శాతం) మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేరిట మంగళవారం వెలువడిన ప్రకటనలో వెల్లడించారు.

అర్బన్‌లో తగ్గిన పోలింగ్... రూరల్ సెగ్మెంట్లలో ఫరవాలేదు..

లోక్‌సభ పరిధిలో ఏడు సెగ్మెంట్లలో నమోదైన పోలింగ్ శాతం చూస్తే పట్టణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో తగ్గింది. గ్రామీణ ప్రాంతాలున్న సెగ్మెంట్లలో ఓటింగ్ పెరిగింది. అత్యధికంగా స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ) నియోజకవర్గంలో అత్యధికంగా 78.77శాతం పోలవగా, అత్యల్పంగా వరంగల్ పశ్చిమలో 52.68శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పరకాల సెగ్మెంట్‌లో 76.86 శాతం, వర్ధన్నపేట (ఎస్సీ)లో 72.24శాతం, పాలకుర్తిలో 71.43 శాతం, భూపాలపల్లిలో 67.71శాతం, వరంగల్ తూర్పు సెగ్మెంట్‌లో 65.08 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి జరిగిన పోలింగ్‌ను పరిశీలిస్తే పట్టణాల్లో ఉండే వారికంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఓటర్లే తమ ఓటుహక్కును ఎక్కువగా వినియోగించుకున్నట్లు కనిపిస్తోంది.

ఈసారి మహిళలదే ఆధిక్యం.. ఆసక్తి చూపని థర్డ్‌జెండర్స్..

2009 నుంచి 2019 వరకు వరుసగా మూడు పర్యాయాలు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకున్న మహిళలు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వారే ముందంజలో ఉన్నారు. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపును 'ఆమె'నే శాసించింది. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో 6,91,902 మంది పురుషులు, 7,01,862 మంది మహిళలు ఓటేయగా.. పురుషుల కంటే 9,960 మంది మహిళలు ఎక్కువగా ఓటెత్తారు. సోమవారం జరిగిన వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 12,56,301 మంది ఓటేయగా... అందులో 6,26,704 మంది పురుషులు, 6,29,512 మంది మహిళలు ఉన్నారు. పురుషుల కన్నా 2,808 మంది మహిళలు అధికంగా ఓటేశారు. ఇదిలా ఉంటే వరంగల్ లోక్‌సభ పరిధిలో థర్డ్‌జెండర్ల ఓట్లు 397 ఉండగా 85 మంది ఓటేశారు. దీంతో లోక్‌సభ ఓటింగ్‌పై ఆసక్తి చూపినట్లుగా కనిపించలేదు.

పోలింగ్‌శాతంపై పోస్టుమార్టం... గెలుపుపై మూడు పార్టీల ధీమా...

వరంగల్ లోక్‌సభ ఎన్నికలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. అభ్యర్థుల ఎంపిక మొదలు.. పోలింగ్ ముగిసే వరకు అనేక పరిణామాలు చోటుచేసుకోగా.. మూడు ప్రధాన పార్టీలు కూడా గెలుపు ధీమాను వ్యక్తం చేస్తున్నాయి. వరంగల్ పార్లమెంట్‌కు పోటీ చేసిన అభ్యర్థులు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ (బీజేపీ), డా.కడియం కావ్య (కాంగ్రెస్), డా.మారేపల్లి సుధీర్‌కుమార్ (బీఆర్ఎస్)లు ఎంపీగా మొదటిసారి పోటీ చేశారు. ఆయా పార్టీల అగ్రనేతలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు, కార్యకర్తలతో కలిసి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేశారు. సోమవారం పోలింగ్ ముగియగా.. మంగళవారం వెలువడిన పోలింగ్ శాతం, పోలైన ఓట్లపై పోస్టుమార్టం మొదలెట్టారు. లోక్‌సభ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో ఎక్కడ పెరిగింది.. ఎక్కడ తగ్గింది అన్న కోణంలో నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నేతలతో కలిసి మూడు పార్టీల అభ్యర్థులు, ముఖ్య నేతలు లెక్కల్లో పడ్డారు. అభ్యర్థులు మాత్రం ఎవరికి వారుగా గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడితేనే ఈ సస్పెన్స్‌కు తెరపడుతుంది.

వరంగల్ పార్లమెంట్ పరిధిలో 2009 నుంచి 2024 వరకు నమోదైన ఓట్లు, పోలింగ్‌శాతం..

సంవత్సరం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
2009	14,86,617	10,30,525	69.32
2014	15,37,778	11,74,631	76.39
2019	16,66,770	10,61,645	63.69
2024	18,24,466	12,56,301	68.86

అసెంబ్లీ	(మొత్తం ఓటర్లు)				(పోలైన ఓట్లు)				
సెగ్మెంట్	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
ఘన్‌పూర్	1,25,210	1,28,898	02	2,54,110	1,00,819	99,337	02	2,00,158	78.77
పాలకుర్తి	1,26,411	1,29,090	13	2,55,514	91,683	90824	08	182515	71.43
పరకాల	1,08,076	1,14,305	02	2,22,383	84,528	86,387	01	1,70,916	76.86
వరంగల్ పశ్చిమ	1,39,322	1,44,108	16	2,83,446	74,819	74,498	03	1,49,320	52.68
వరంగల్ తూర్పు	1,25,638	1,32,518	339	2,58,495	83,105	85,066	63	1,68,234	65.08
వర్ధన్నపేట	1,34,257	1,39,491	18	2,73,766	98,653	99,108	02	1,97,763	72.24
భూపాలపల్లి	1,36,507	1,40,238	07	2,76,752	93,097	94,292	06	1,87,395	67.71
మొత్తం	8,95,421	9,38,648	397	18,24466	6,26,704	6,29,512	85	12,56,301	68.86

పోలింగ్ ప్రశాంతం : కలెక్టర్



రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య

కాళోజీ సెంటర్ : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 18,24,466 మంది ఓటర్లకు 12,56,301 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. 6,29,512 మంది మహిళలు, 6,26,704 పురుషులు, ఇతరులు 85 మంది ఓటు వేశారని వివరించారు. జిల్లా యంత్రాంగం, సహకరించిన ఓటర్లు, ప్రజలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధులను ఆమె అభినందించారు.

సమష్టి కృషితో ఎన్నికలు విజయవంతం

- హర్షం వ్యక్తం చేసిన కలెక్టర్ భవేష్‌మిశ్రా



భూపాలపల్లి: ప్రజలు, అధికారుల సమన్వయం, సమష్టి కృషితోనే పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంపై కలెక్టర్ భవేష్‌మిశ్రా హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచి 13వ తేదీ వరకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాల భాగస్వామ్యం మరువలేనిదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతీ ఒక్కరిని అభినందించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతమైన జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషమన్నారు. పోలింగ్ సమయం ఉదయం 7నుంచి సాయంత్రం 4 గంటల వరకే అయినప్పటికీ ఓటర్లు పెద్ద ఎత్తున ఎండను సైతం లెక్కచేయకుండా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడంలో చైతన్యం చాటారని తెలిపారు. అందువల్ల గత పార్లమెంట్‌లో కంటే ప్రస్తుతం అధికంగా పోలింగ్ శాతం నమోదు అయిందని తెలిపారు.

ఉపాధ్యాయులపై దాడి అమానుషం

భూపాలపల్లి అర్బన్: నారాయణఖేడ్ జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులపై పోలీసులు దాడి చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్, రవీందర్‌లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సిబ్బందికి వచ్చే డబ్బులు ఇవ్వాలని ఆర్డీఓను సంప్రదించగా వారిపై లాఠీచార్జ్ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు, ఎన్నికల సిబ్బందికి అన్ని జిల్లాల్లో సమాన గౌరవ వేతనం ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అయినప్పటికీ ఎన్నికల నిబంధనల ఆసరాగా చేసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తూ తక్కువ గౌరవ వేతనం ఇస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపించారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఓపీవోలకు తక్కువ డబ్బులు ఇచ్చారని వివరించారు. జిల్లా అధికారులు పున:పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరంగల్ స్ట్రాంగ్‌రూంకు ఈవీఎంలు



కంటైనర్‌లో లోడ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



ప్రత్యేక బాక్స్‌లలో భద్రపరిచిన ఈవీఎంలు

భూపాలపల్లి అర్బన్: వరంగల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి నియోజకవర్గంలో వినియోగించిన ఈవీఎంలను మంగళవారం తెల్లవారు జామున వరంగల్‌కు తరలించారు. జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపునకు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని ఈవీఎంలను భద్రపరిచేందుకు వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో భూపాలపల్లి నియోజకవర్గంలోని 317 పోలింగ్ కేంద్రాల ఈవీఎంలను భారీ కంటైనర్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో భారీ భద్రత మధ్య తరలించారు. నియోజకవర్గ ఓట్లను వరంగల్ ఎనుమాములలో లెక్కించనున్నారు.

దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవం

హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు

కాటారం: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వగ్రామం కాటారం మండలంలోని ధన్వాడలో శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా కొనసాగింది. మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దత్తాత్రేయ స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య వార్షిక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతితో పూజలకు సమాప్తం పలికారు. శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, మంచిర్యాల, రామగుండం, భూపాలపల్లి, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు విజయరమణారావు, ప్రేమ్‌సాగర్ రావు, మాక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, గండ్ర సత్యనారాయణరావు, గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు వారి గోత్ర నామాలతో అర్చనలు జరిపించారు. ఈ సందర్భంగా పండితులు ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలకు వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి శ్రీధర్‌బాబు అతిథులకు శేషవస్త్రాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు, ఐఎన్‌టీయూసీ వైస్ చైర్మన్ జనక్‌ప్రసాద్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, బాన్సోడ రాణిబాయి, మల్హల్‌రావు తదితరులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి..

భూపాలపల్లి రూరల్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు డిప్యూటీ సీఎంను సన్మానించి సెల్ఫీలు దిగారు. ధన్వాడలోని దేవాలయ వార్షికోత్సవానికి వెళ్లివస్తుండగా క్యాంపు కార్యాలయానికి వచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఓటుకు దూరంగా..

పోలింగ్ కేంద్రాలకు వెళ్లని 89వేల మంది

- నియోజకవర్గంలో ఫైనల్‌గా 67.71శాతం పోలింగ్
- భూపాలపల్లి పట్టణంలో అత్యల్పంగా ఓటింగ్
- మున్సిపాలిటీ పరిధిలో 49శాతమే..

నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	2,76,752
పోలైన ఓట్లు	1,87,395
మహిళలు	94,292
పురుషులు	93,097
ఇతరులు	ఆరుగురు



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోలేదు. నియోజకవర్గంలోని భూపాలపల్లి, చిట్యాల, టేకుమట్ల, గణపురం, మొగుళ్లపల్లి, రేగొండ, గొరికొత్తపల్లి, శాయంపేట మండలాల్లో 2,76,752 మంది ఓటర్లు ఉండగా సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 1,87,395 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగితా 89,357 మంది ఓటు హక్కు వినియోగించుకోకుండా దూరంగా ఉన్నారు. వృద్ధులు, వికలాంగులు సైతం అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొన్నారు. కాని మధ్య వయస్సు కలిగిన వారే అధికంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు రాకపోవడం శోచనీయం. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం 67.71 శాతమే నమోదైంది. ప్రతీ పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే విధంగా పోలింగ్ శాతం తక్కువగానే నమోదవుతోంది.

మున్సిపాలిటీలో 49శాతమే..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30వార్డుల్లో 47 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. పట్టణంలో 53,035 మంది ఓటర్లు ఉన్నారు. కాగా పార్లమెంట్ ఎన్నికల్లో 26,396 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 13,687, మహిళలు 12,706, ఇతరులు ముగ్గురు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో పట్టణంలో 49శాతమే పోలింగ్ నమోదైంది. పట్టణం నుంచి ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా, ఉన్నత చదువుల నిమిత్తం వరంగల్, హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లి చదుకుంటున్న వారు ఉంటారు. వారిలో కొంత మంది ఓటు వేయడానికి రాకపోగా పట్టణంలో ఉన్న వారు సైతం ఓటు వేయనట్లుగా కనిపిస్తోంది. ఇందుకు కొంత అధికారుల వైఫల్యం కూడా కారణంగా ఉన్నట్లు చర్చసాగుతోంది. కాలనీలు మారిన వారు ఓటు మార్పిడి చేసుకోకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని జాబితాలో నుంచి తొలగించకపోడం, ఉన్నవారికి పోల్ చీటీలు పంపిణీ చేయకపోవడంతో వారి పోలింగ్ బూత్ ఎక్కడో తెలియక కూడా ఓటు హక్కు వినియోగించుకోకుండా ఉన్న వారు ఉన్నారు. పట్టణంలోని 15వ బూత్‌లో మొత్తం 1,149 మంది ఓటర్లు ఉండగా కేవలం 376 మంది మాత్రమే ఓటు వేశారు. ఈ బూత్‌లో 32శాతం మంది ఓటర్లు మాత్రమే ముందుకు వచ్చారు. అదే విధంగా ప్రతీ బూత్‌లో 40 నుంచి 50 శాతం వరకే ఓటు శాతం నమోదయ్యింది. పట్టణంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రచారం చేసినప్పటికీ, అధికారులు విస్తృతంగా ఓటర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ పోలింగ్‌శాతం ఏమాత్ర పెరగలేదు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వెంకటాపురం(కె): మండల పరిధిలోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈఘటన మంగళవారం చోటు చేసుకుంది. తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ కథనం ప్రకారం.. గోదావరి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. ఈ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

రైతులు ధైర్యంగా ఉండాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గణపురం: అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడిసిపోవడంతో పాటు పొలాల్లోని వరి నెలకొరిగి ధాన్యం నేలరాలిందని ఈ విషయంపై రైతులు ధైర్యంగా ఉండాలని ప్రతీ ధాన్యంగింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని తడిసిన వరి ధాన్యాన్ని ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలతో నియోజక వర్గంలో కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యంతో పాటు పంట పొలాల్లోని వరి నేల కొరిగి తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తడిసిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. అందుకు కావాల్సిన చర్యలను చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు కూడా ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనగామలో బాలిక కిడ్నాప్!

- కేసును ఛేదించిన పోలీసులు.. నలుగురిపై కేసు

జనగామ : జనగామ పట్టణానికి చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి రెడ్డి మంగళవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. బాలికకు ఓ వ్యక్తితో రెండు నెలల క్రితం ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. రోజువారీగా చాటింగ్ చేస్తున్న క్రమంలో బాలికను హైదరాబాద్‌కు రావాలని కోరగా, ఆమె అంగీకరించినట్లు తెలిపారు. జనగామకు చెందిన ముగ్గురు వ్యక్తుల సాయంతో ఈ నెల 12వ తేదీ రాత్రి సెల్ఫ్ డ్రైవింగ్ (జీపీఎస్ ట్రాకింగ్ ఉన్న వాహనం) కారు తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లిందన్నారు. బాలిక కనిపించడం లేదనే కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆరా తీయగా, జనగామకు చెందిన కారులో వెళ్లినట్లు సమాచారం అందగా కారు ఓనర్‌ను పిలిపించామన్నారు. కారుకు జీపీఎస్ ఉండడంతో దాని ఆధారంగా బాలిక ఉన్న ప్రదేశం కనిపెట్టి, నలుగురు వ్యక్తులతో పాటు ఆమెను తీసుకొచ్చామన్నారు. బాలిక వాంగ్మూలం రికార్డు చేసినట్లు, కిడ్నాప్ చేశారని తేలితే నలుగురిని రిమాండ్‌కు పంపిస్తామన్నారు. ఇటీవల రాష్ట్రంలో అనేక చోట్ల మహిళలు, బాలికలను మాయమాటలతో ట్రాప్‌లో పడేస్తూ..అమ్మకానికి పెడుతున్నట్లు జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మానుకోటలో రెండిళ్లలో చోరీ

- మూడు తులాల బంగారం, 19 తులాల వెండి, రూ.5 వేల నగదు అపహరణ


దొంగలు పగుల గొట్టిన బీరువా


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న టౌన్ ఎస్సై

మహబూబాబాద్ రూరల్ : మానుకోట జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఇరువురి ఇళ్లలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో మూడు తులాల బంగారం, 19 తులాల వెండి ఆభరణాలు, రూ.5 వేల నగదు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్ కెనరా బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న బానోత్ సతీష్, కుటుంబ సభ్యులు కలిసి ఓటు వేసేందుకు ఇటీవల సొంతూరుకు వెళ్లారు. మంగళవారం ఉదయం వారు తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉండడం కనిపించింది. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. టౌన్ ఎస్సై శివ, ఫింగర్ ప్రింట్స్ బృందం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అలాగే వారి పక్కింట్లో నివాసం ఉండే నరేష్ ఇంట్లోనూ దొంగలు పడి తులం బంగారు చైన్ ఎత్తుకెళ్లారు. మరో రెండు ఇళ్లలో చోరీలకు యత్నించినప్పటికీ ఎలాంటి బంగారం, వెండి ఆభరణాలు, నగదు దోచుకుపోలేదు. ఘటనలపై బాధితులు టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రమాదాలకు కేరాఫ్.. దాబాలు

జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రదేశాల్లోనే ఏర్పాటు

- రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురి మృతి
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



మీదికొండ క్రాస్ సమీపంలోని దాబా


ఘన్‌పూర్ శివారు క్రాస్ వద్ద..


ఘన్‌పూర్ ఎస్సీ కాలనీ క్రాస్ వద్ద ..

స్టేషన్‌ఘన్‌పూర్: సాధారణంగా జాతీయ రహదారిపై క్రాసింగ్‌లు.. యూ టర్న్‌లు ఉన్న ప్రదేశాల్లో దాబాల (హోటళ్లు) ఏర్పాటుకు సంబంధిత అధికారులు అనుమతి ఇవ్వరు. ఎందుకంటే వాయువేగంతో దూసుకొచ్చే వాహనాలు అదుపు తప్పి ఈ హోటళ్లను ఢీకొంటే తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుంది. అలాగే, భోజనం చేసి బయటకు వచ్చే సమయంలో ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. అందుకే ఈ ప్రాంతాల్లో దాబాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే హైదరాబాద్–హనుమకొండ జాతీయ రహదారిపై నియోజకవర్గ కేంద్రం స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాత్రం ఆ నిబంధనలు అమలు కావడం లేదు. ఏ కారణం చేతనో కాని అధికారులు అనుమతి ఇవ్వడంతో నిర్వాహకులు ఆయా ప్రదేశాల్లోనే ఏర్పాటు చేశారు. మండలంలోని మీదికొండ క్రాస్ వద్ద ఒకటి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పాత శ్రీవాణి స్కూల్ సమీపాన మరొటి, పల్లగుట్ట క్రాస్ సమీపం ఎస్సీ కాలనీ వద్ద రెండు.. మొత్తం నాలుగు ప్రమాదకర ప్రదేశాల్లోనే ఏర్పాటు చేశారు. ఫలితంగా భోజనం, ఇతర పదార్థాలు భుజించడానికి గతంలో ఆయా దాబాలకు వచ్చిన పలువురు పలుమార్లు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. అయినా సంబంధిత అధికారులు, స్థానిక పోలీసులు ఈ విషయమై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కాగా, మండలంలోని మీదికొండ క్రాస్ వద్ద ఉన్న దాబాహోటల్ సమీపంలో ఏడాది క్రితం రాజధాని బస్సు ఢీకొన్న ఘటనలో కారులో ఉన్న ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. అదే విధంగా జాతీయ రహదారిపై ఇటీవల పలు రోడ్డు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులకు పట్టడం లేదు. ఈ విషయంలో సంబంధిత అధికారులు, పోలీసులకు అమ్యామ్యాలు అందుతున్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

పేరుకే ఫ్యామిలీ దాబా..

పేరుకే ఫ్యామిలీ దాబా. లోపల మాత్రం ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. అటు ఎక్సైజ్.. ఇటు సివిల్ పోలీసులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో దాబాల వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా నడుస్తోంది. యజమానులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారుతోంది. ఇదిలా ఉండగా గతంలో దాబాల వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందారు. ఫలితంగా ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అయినా సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

రైలునుంచి పడి యువకుడి మృతి


ఇమ్రాన్ అన్సారి (ఫైల్)

కాశిబుగ్గ: రైలు నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం .. ముంబాయికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్ అన్సారి (18) తన బావతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో కొంత కాలంగా ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అయితే అన్సారి.. తన బావ, స్నేహితుడితో కలిసి ముంబాయి వెళ్లడానికి రాజమండ్రిలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ధర్మారం రైల్వే గేట్ సమీపంలో రైలు నుంచి పడ్డాడు. దీంతో అప్‌లైన్ ట్రాక్ పక్కన పడి మృతి చెందాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బావ ఫక్రుద్దీన్ అన్సారీకి అప్పగించామని సీఐ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య..

సంగెం/కాశిబుగ్గ: మద్యం మానలేక ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం.. మండలంలోని కుంటపల్లికి చెందిన కలకొండ సుగుణ, సదానందం దంపతులకు ఇద్దరు కుమారులు రమేష్, మహేందర్ (28) ఉన్నారు. పిల్లల చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. అప్పటి నుంచి పెద్దమ్మ, పెద్దనాన్న జయలక్ష్మి, వెంకటనారాయణ పెంచారు. మహేందర్ కులవృత్తి వండ్రంగితో పాటు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానుకోలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం చింతలపల్లి–ఎల్గూర్‌స్టేషన్ మధ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోదరుడు రమేష్‌కు అప్పగించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు.


మహేందర్ (ఫైల్)

విద్యుదాఘాతానికి వృద్ధురాలి బలి


కొమురమ్మ(ఫైల్)

తొర్రూరు రూరల్: విద్యుదాఘాతానికి ఓ వృద్ధురాలు బలి అయింది. ఈ ఘటన మండలంలోని కంఠాయపాలెంలో చోటు చేసుకుంది. ఎస్సై పిల్లల రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లికొండ నాగమణి, ఇద్దమ్మ.. సోమవారం రాత్రి ఇంట్లో ఇనుప దండెంపై దుస్తులు ఆరవేస్తుండగా కరెంట్‌షాక్‌కు గురై కేకలు వేశారు. ఈ కేకలు విన్న ఇంటి పక్కన ఉన్న డొనుక కొమురమ్మ(70) వారిని కాపాడేందుకు వెళ్లి తాను కూడా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. నాగమణి, ఇద్దమ్మకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


రవి (ఫైల్)


రమేశ్ (ఫైల్)

జనగామ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన పట్టణంలోని విజయ డెయిరీ బైపాస్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల కేంద్ర ఏరియాకు చెందిన మునుకుంట్ల రవి (37) సోమవారం రాత్రి తన పని ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో హనుమాన్ గుడి వద్ద వెనక నుంచి యశ్వంతాపూర్ నుంచి జనగామకు వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో రవికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే రవిని ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సృజన్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఏటూరునాగారంలో మరో యువకుడు..

ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఏటూరునాగారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన గుగ్గిల్ల రమేశ్(38) పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారిపై ఉన్న హైవే ట్రీట్ హోటల్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఏటూరునాగారం ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు. అయితే రమేశ్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొందా..? లేదా పార్కింగ్ చేసి ఉన్న లారీని ఢీకొని మృతి చెందడా అనే విషయం తెలియాల్సి ఉంది.

మెస్ ఓపెన్ చేయాలి

- కేయూలో విద్యార్థినుల ఆందోళన
- రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం


విద్యార్థి సంఘాల బాధ్యులు, విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ రమేశ్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పద్మాక్షి మహిళా మెస్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు ఆ హాస్టల్ వద్ద ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ , ఏబీఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు మంద శ్రీకాంత్, మంద నరేష్, మర్రి మహేష్, తదితరులు మద్దతు పలికారు. ఆందోళన సమాచారం అందుకున్న కేయూ హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు ఘటనాస్థలికి చేరుకుని ఆయా సంఘాల నాయకులు, విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినుల సంఖ్య సరిపడా ఉంటేనే మెస్‌ను ఓపెన్ చేస్తామని వారికి తెలిపారని సమాచారం. ఈ సందర్భంలో డైరెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత విద్యార్థినులు, ఆయా సంఘాల బాధ్యులు క్యాంపస్‌లోని పరిపాలన భవనానికి చేరుకుని ఆందోళనకు దిగారు. కామన్‌మెస్, పద్మాక్షి మహిళా హాస్టళ్ల మెస్‌లను ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వీసీ రమేశ్‌తో కలిసి మెస్‌లు ఓపెన్ చేయాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఈనెల 15నుంచి మహిళా హాస్టల్ మెస్‌ను రీఓపెన్ చేయిస్తామని హామీ ఇచ్చారని సమాచారం. సరిపడా విద్యార్థులు వచ్చాకే (బాయ్స్‌కు) కామన్ మెస్ రీఓపెన్ చేయిస్తామని విద్యార్థి సంఘాల బాధ్యులు, విద్యార్థులకు తెలియజేశారని సమాచారం. దీంతో ఆందోళన విరమించారు. కాగా, పీజీ, ఇతర కోర్సులు కలిగిన విద్యార్థినులు మెస్‌కార్డులు కలిగివారిలో 25శాతం మంది వస్తే మెస్‌ను రీఓపెన్ చేస్తామని, కామన్‌మెస్‌లో కూడా 25శాతం మంది విద్యార్థులు వస్తే రీఓపెన్ చేస్తామని హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు వివరణ ఇచ్చారు.

మెస్‌లు ఓపెన్..

కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం రాత్రి మెస్‌లు ఓపెన్ అయ్యాయి. మెస్‌లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేసిన నేపథ్యంలో పద్మాక్షి మహిళా హాస్టల్‌లో వర్కర్లతో వంట చేయించారు. అనంతరం పద్మాక్షి హాస్టల్ విద్యార్థినులు, అలాగే అక్కడి నుంచి కామన్ మెస్‌కు తీసుకొచ్చి విద్యార్థులకు(బాయ్స్) భోజనం వడ్డించారు. కాగా, నేటినుంచి (బుధవారం) కామన్‌మెస్, పద్మాక్షిమెస్ యథావిధిగా కొనసాగించబోతున్నారు. విద్యార్థులు ఎక్కువమంది వస్తే రెండు చోట్ల వంటచేసి మెస్ సదుపాయం కల్పించాలని, లేనిపక్షంలో ఒకే చోట వంట చేసి పద్మాక్షి హాస్టల్ విద్యార్థినులు, కామన్‌మెస్‌కు సదుపాయం కల్పించాలని యూనివర్సిటీ అధికారులు యోచిస్తున్నారు.

పోలింగ్ రోజు కాంగ్రెస్ ప్రచారం

- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్


మాట్లాడుతున్న అరూరి రమేశ్

హన్మకొండ: ఓడిపోతామనే భయంతో పోలింగ్ రోజు కాంగ్రెస్ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజు సోషల్ మీడియా ద్వారా చేసిన ప్రచారంతో పాటు, తనను ఓటర్లు నిలదీస్తున్నట్లు ఒక చానల్ పేరుతో చేసిన ఫేక్ న్యూస్‌పై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ లీగల్ సెల్ ఫిర్యాదు చేస్తుందన్నారు. తనకు ఓటు వేసిన ఓటర్లకు, తన గెలుపుకు కృషి చేసిన పార్టీ శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. అనంతరం బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ మృతికి నిమిషం మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, బీజేపీ వరంగల్ పార్లమెంట్ ప్రభారి డా.వి.మురళీధర్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కొలను సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా గుట్టను తవ్వేస్తున్నారు

- అనుమతి లేకుండా వ్యాపారం
- పట్టించుకోని మైనింగ్ శాఖ అధికారులు


గుట్టను తవ్వుతున్న పొక్లెయినర్

హసన్‌పర్తి : మండలంలోని దేవన్నపేట ప్రభుత్వ పాఠశాల సమీపంలో గల గుట్ట క్వారీగా మారింది. అనుమతి లేకుండానే గుట్టను తవ్వేస్తున్నారు. అధికారులు కనుసన్నల్లో మట్టి దందా జరుగుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేవన్నపేట పరిధిలోని సర్వే నంబర్ 217లో సుమారు 17.02 ఎకరాల గుట్ట ఉంది. ఓ రియల్టర్ ఈ గుట్టను క్వారీగా మార్చేసి, రాత్రింబవళ్లు తేడా లేకుండా పొక్లెయినర్ సాయంతో మట్టిని తవ్వుతూ టిప్పర్ల ద్వారా నగరానికి తరలించి విక్రయిస్తున్నాడు. కొంతమంది అధికార పార్టీ నాయకులు, అధికారుల అండాతోనే సదరు వ్యాపారి మొరం దందా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అక్రమంగా మట్టి దందా కొనసాగుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. మట్టి క్వారీ తవ్వేందుకు మైనింగ్ అనుమతి తప్పనిసరి. అయితే క్యూబిక్ మీటరుకు రూ.70ల నుంచి రూ.80 వరకు ప్రభుత్వానికి చలానా రూపంలో నగదు చెల్లించాల్సి ఉంటోంది. ఒక టిప్పర్ మట్టికి రూ.1,000 నుంచి రూ.1,200ల నగదు ప్రభుత్వానికి చెల్లించాలి. ఇప్పటికి ఈగుట్ట నుంచి వేలాది టిప్పర్ల మట్టి తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. మాముళ్ల మత్తులో అధికారులు సదరు యజమానిపై చర్యలు తీసుకోకుండ వెనుకంజ వేస్తున్నారని విమర్శలున్నాయి.

కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా సమ్మయ్య

- ఉత్తర్వులు జారీచేసిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి


సమ్మయ్యకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్‌గా ఫార్మసీ కళాశాల డీన్ గాదె సమ్మయ్యను మంగళవారం రాత్రి నియమించారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు నియామక ఉత్తర్వు కాపీని వీసీ రమేశ్.. సమ్మయ్యకు అందజేశారు. సమ్మయ్య గతంలో కేయూ అంబేడ్కర్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్‌గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నేడు ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. పద్మాక్షి మహిళా హాస్టల్ వద్ద విద్యార్థినులు మెస్ ఓపెన్ చేయాలని ఆందోళన చేయడం, వాగ్వాదానికి దిగడంతో మనస్తాపానికి గురైన ఆయన.. తన పదవికి రాజీనామా చేశారని తెలుస్తోంది. శ్రీనివాస్‌రావు స్థానంలో సమ్మయ్యను నియమించారు.

మూడేళ్లలో నలుగురు హాస్టళ్ల డైరెక్టర్లు విధులు!

కేయూ వీసీ రమేశ్ 2021 మే 23న బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 21న మూడేళ్ల పదవీ కాలం పూర్తికాబోతుంది. రమేశ్ బాధ్యతలు స్వీకరించేనాటికే హాస్టళ్ల డైరెక్టర్‌గా జువాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎం ఇస్తారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2017సెప్టెంబర్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు కొనసాగారు. పలు కారణాలతో ఆయన పదవికి రాజీనామా చేయగా 2022 మార్చిలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ మంజులను నియమించారు. 2023 జూలై 4వరకు కొనసాగుతుండగానే ఆమె స్థానంలో జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై వెంకయ్యను 2023 జూలై 5న నియమించారు. అనంతరం ఆయన స్థానంలో 2024 జనవరిలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావును నియమించారు. నాలుగు నెలలు 5రోజులకే రాజీనామా చేయగా ఆయన స్థానంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సమ్మయ్యను నియమించారు.

ఇళ్లలో కట్టేసిన పశువుల అపహరణ

- మహిళను స్తంభానికి కట్టేసిన గ్రామస్తులు
- పోలీసులకు అప్పగింత



పశువుల అపహరణకు యత్నించిన మహిళను కట్టేసిన గ్రామస్తులు

నర్సంపేట రూరల్ : ఇళ్లలో కట్టేసిన గేదెలు, ఆవులు, దూడలను అపహరిస్తున్న ఓ ముఠాను పట్టుకునేందుకు ప్రయత్నించగా ఒకరు చిక్కగా, మరో ముగ్గురు పరారయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామ శివారు ఐదోవార్డులో రాత్రి వేళలో కొందరు ముఠాగా ఏర్పడి గేదెలు, ఆవులు, దూడలను అపహరిస్తున్నారు. సోమవారం రాత్రి సైతం ఇదే విధంగా నలుగురు వచ్చి పలు ఇళ్లలోని దూడలను, గేదెలు తీసుకెళ్తుండగా అలజడి వచ్చింది. దీంతో స్థానికులు ఒక్కసారిగా లేచి వారిని వెంబడించడంతో గేదెలు, దూడలను వదిలి పారిపోయారు. ఆ ముఠాలో ఓ మహిళ చేతికి చిక్కడంతో ఆమెను స్తంభానికి కట్టేసి మిగతా ముగ్గురి కోసం గాలించారు. వారు దొరకక పోవడంతో మంగళవారం ఉదయం సదరు మహిళను పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చెన్నారావుపేట : తోటిమిత్రులు దాడి చేయడంతో ఓ యువకుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన మండలంలోని ఎల్లాయగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంద జనార్దన్ కుమారుడు నితీష్‌ను తన స్నేహితులు గొడవపడి సోమవారం సాయంత్రం కొట్టారు. దీంతో అవమానాన్ని తట్టుకోలేక గ్రామ శివారులో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భయపడిన వెంటనే నితీష్ తన తండ్రికి ఫోన్ చేసి మందు తాగిన విషయం చెప్పడంతో చికిత్స నిమిత్తం నర్సంపేట ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. నితీష్ తండ్రి ఫిర్యాదు మేరకు అర్కాల రాజేష్, పుటికల చంద్రకిరణ్, చరణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన ఒకరికి జైలు



వరంగల్ లీగల్ : బాలికపై లైంగిక దాడికి యత్నించి బెదిరింపులకు పాల్పడ్డ ఒకరికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ మంగళవారం హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. కమలాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని స్థానిక జిల్లా పరిషత్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. అయితే 2018 ఆగస్టు 4న ఇల్లు శుభ్రం చేస్తున్న సమయంలో ఎవరు లేరని నిర్ధారించుకున్న అదే గ్రామానికి చెందిన ఎల్ల బోయిన గణేష్ (20) ఇంట్లోకి చొరబడ్డాడు. ఒంటరిగా ఉన్న బాలిక చేయిపట్టి లాగి 'నువ్వంటే నాకు ఇష్టం.. నా కోరిక తీర్చు.. లేదంటే నిన్ను చంపుతాన'ని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైన బాధిత బాలిక గట్టిగా అరుస్తూ గణేష్ నుంచి తప్పించుకొని బయటకు పరిగెత్తింది. చుట్టుపక్కల వారు రావడంతో సదరు యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. తల్లిదండ్రులు వచ్చిన తర్వాత జరిగిన విషయం తెలిపింది. చీకటి పడటంతో మరుసటి రోజు కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బాధిత బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో ఎల్లబోయిన గణేష్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. కేసును పోలీస్ అధికారులు హరికృష్ణ, సందీప్, సూర్యప్రకాష్ విచారించారు. భరోసా కేంద్రం లీగల్ ఆఫీసర్ సీహెచ్ నీరజ, లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి విచారణను పర్యవేక్షించగా, పీపీ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

యాక్సిడెంట్ కేసులో మరొకరికి ఏడాది..

మరిపెడ/మరిపెడ రూరల్: నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామ పరిధి అమ్రియతండాకు చెందిన ఒకరికి తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై ఎస్‌కే తాహెర్‌బాబా మంగళవారం తెలిపారు. 2014లో మరిపెడ మున్సిపాలిటీకి చెందిన భూక్య లక్ష్మణ్ పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై మరిపెడ మండలం దంటకుటతండాకు వెళ్లాడు. తిరిగి మరిపెడ బంగ్లాకు క్రమంలో నర్సింహులపేట మండల పెద్దనాగారం గ్రామ పరిధి అమ్రియతండాకు చెందిన బానోత్ రమేశ్.. ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడుపుతూ భవాని ఆలయం వద్ద బైక్‌ను ఢీకొనగా లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి భూక్య హోలీ మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై నాగభూషణం కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం తొర్రూరు సివిల్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గణేష్ ఆనంద్ వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి మట్ట సరిత.. బానోత్ రమేశ్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై తెలిపారు.